క్లుప్తంగా

పేదల చేతిలో వజ్రాయుధం ఆరోగ్యశ్రీ

గుడివాడ టౌన్: పేదల ఆరోగ్య పరిరక్షణలో ఆరోగ్యశ్రీ కార్డు ఒక వజ్రాయుధం వంటిదని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంవీ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కాకర్ల వీధిలోని 17వ వార్డు సచివాలయం, ఎన్టీఆర్ కాలనీ లోని 5వ వార్డు సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ ఎ కృష్ణమోహన్, వార్డు ఇన్‌చార్జ్‌లు అల్లం రామ్మోహన్‌రావు, దారం కాంచనకుమారి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మాదాసు వెంకట లక్ష్మీకుమారి, టీవీ రమణకుమార్, వైద్యులు డాక్టర్ జీజేడీ ట్విన్సన్, డాక్టర్ నాగార్జునరావు, డాక్టర్ కెజియా, డాక్టర్ గంగరాజు పాల్గొన్నారు. 5వ వార్డు ఇన్‌చార్జ్ వెంపల అప్పారావు, సచివాలయాల ఇన్‌చార్జ్ దుడ్డు చిన్నా, అర్జా ప్రసాదు, జోగా నాగేశ్వరరావు, మున్సిపల్ ఆర్ఓ విజయ్‌కుమార్, వైద్యులు డాక్టర్ తేజస్విని, డాక్టర్ సుమ చౌదరి, డాక్టర్ భద్రీనాథ్, డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ట్రాఫిక్ ఎస్‌ఐ

గుడివాడ టౌన్: గుడివాడ పట్టణ ట్రాఫిక్ ఎస్‌ఐగా బదిలీపై వచ్చిన అడపా గరగారావు బుధవారం ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)ని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నట్లు తెలిపారు. కొడాలి నానీ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సిబ్బందిని వినియోగించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు

గుడివాడ టౌన్: ఏసుక్రీస్తు శిలువ మరణాన్ని స్మరించుకుంటూ క్రైస్తవులు పాటిస్తున్న శ్రమల దినాల(లెంట్ డేస్) ఉపవాస దీక్షలు బుధవారం నుంచి గుడివాడలో ప్రారంభమయ్యాయి. వందల సంఖ్యలో భక్తులు మాలా ధారణ చేశారు. నేటి నుంచి గుడ్‌ఫ్రైడే వరకు ఈ దీక్షలు కొనసాగిస్తారు.

పేదల ఉన్నతికి వేల కోట్లు పంచిన ఏకైక సీఎం జగన్

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



ఓవర్‌హెడ్ ట్యాంక్, పైప్‌లైన్‌ల శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడరూరల్: రాష్ట్రంలో పేదల ఉన్నతి కోసం రూ.2 లక్షల 57వేల కోట్లు పంచిపెట్టిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పేర్కొన్నారు. మండలంలోని మల్లాయపాలెంలో రూ.1.11 కోట్లతో తాగునీటి వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు, పైప్‌లైన్‌ల నిర్మాణలకు శంకుస్థాపన చేసేందుకు బుధవారం ఆయన విచ్చేశారు. తొలుత గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కొడాలి నానికి భారీ గజమాలతో వైఎస్సార్ సీపీ శ్రేణులు స్వాగతం పలికారు. గ్రామంలో ర్యాలీగా పర్యటించిన ఎమ్మెల్యే నానికి వీధివీధినా గ్రామస్తులు ఆత్మీయ స్వాగతం పలికారు. మల్లాయపాలెంలో రూ.1.11 కోట్లతో నూతనంగా నిర్మించనున్న తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంక్, పైప్‌లైన్‌ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎంతమంది తిట్టినా పేదల ఉన్నతికి వెనుకడుగు వేయకుండా కష్టపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప నాయకుడు అని పేర్కొన్నారు. విజయవాడ నుంచి గుడివాడ వచ్చే వరకు వేలాది కోట్లతో ఫోర్‌వే రహదారులు, రైల్వే ఫ్లైఓవర్లను ప్రభుత్వం నిర్మిస్తుంటే రోడ్డు పక్కన చిన్న గుంటలను చూపిస్తూ అభివృద్ధి జరగలేదంటూ ప్రతిపక్షాలు అర్థం లేని విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రతిపక్ష టీడీపీ కోర్టులకు వెళ్లడం వల్ల గుడివాడ పురపాలక సంఘంలో విలీనమైన మల్లాయపాలెంలో ఎన్నికలు జరగలేదని, గ్రామ అభివృద్ధికి అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తూ తాము అన్ని విధాలుగా కృషి చేస్తున్నామన్నారు. మల్లాయపాలెం ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడేవారని, త్వరలోనే వాటర్‌ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తి చేసి, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. అనంతరం గ్రామంలోని పలువురు రైతులు పంటబోదె గురించి తాము పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కొడాలి నాని సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, సూరపనేని కల్యాణ్, పాలేటి శివ సుబ్రహ్మణ్యం(చంటి), గద్దే రాము, ఎంపీపీ గద్దే పుష్పరాణి, జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, వైస్ ఎంపీపీ భట్టు నాగమల్లేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ మేకల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మురారి సుశీల, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు, ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు, కాంట్రాక్టర్ భద్రం, వైఎస్సార్ సీపీ నాయకులు మురారి నగేష్, గంటా సురేష్, మోటూరు నాని, బాజీ, ఆర్‌కె, షేక్ సయ్యద్, సుబ్బారావు, గులాబ్, తాజుద్దీన్, షమ్ము, క్రేన్ బాబి, ఎంపీడీఓ కె.జ్యోతి, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ స్వచ్ఛమైన తాగునీరు



జలజీవన్ మిషన్ పనులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికీ స్వచ్ఛమైన తాగునీరందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. మండలంలోని చటాకాయలో రూ.36 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో ఏర్పాటు చేయనున్న మంచినీటి పైప్‌లైన్ పనులకు బుధవారం వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ప్రధాన ధ్యేయంతో ముఖ్యమంత్రి జగనన్న పనిచేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే వివిధ అభివృద్ధి పనులకు రూ.కోట్లలో నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనులను దృష్టిలో పెట్టుకొని వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ అడవి వెంకట కృష్ణమోహన్‌తో, జెడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ల బేబి, సర్పంచ్ శేషారావు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట

కైకలూరు: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. కైకలూరు ఓరియంటల్ హైస్కూల్లో రూ.67.5లక్షల నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే డీఎన్నార్, వీరకుమారి దంపతులు బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓరియంటల్ హైస్కూల్లో విద్యనభ్యసించానని, ఇదే పాఠశాలలో తరగతి గదులను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఎంపీపీ అడవి వెంకట కృష్ణమోహన్‌తో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ల బేబి, వైస్ ఎంపీపీ ఎండీ జహీర్, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి పాల్గొన్నారు.

బాబా దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే కొడాలి నాని



బాబాకు గంధం, చాదర్‌ను సమర్పించిన ఎమ్మెల్యే

గుడివాడరూరల్: మండలంలోని మల్లాయపాలెంలోని సయ్యద్ హజరత్ షాలర్ షా ఔలియాబాబా దర్గాను గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) బుధవారం దర్శించుకున్నారు. తొలుత పవిత్ర గంధం, చాదర్‌ను శిరస్సుపై ఉంచుకుని మైనార్టీ పెద్దలతో కలసి ఎమ్మెల్యే కొడాలి నాని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మత గురువులతో కలసి ఎమ్మెల్యే నాని బాబావారికి గంధం, చాదర్‌ను సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్లాయపాలెంలో ఎంతో విశిష్టత కలిగిన బాబా దర్గాను దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. బాబా ఆశీస్సులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలేటి చంటి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, ముస్లిం పెద్దలు షేక్ సయ్యద్, బాజీ, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ షాకీర్, ఎండీ గులాబ్, నాయకులు మురారి నగేష్, గంటా సురేష్, తాజుద్దీన్, షమ్ము పాల్గొన్నారు.

మంచి జరగాలంటే వైఎస్సార్ సీపీని ఆశీర్వదించండి

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



పెదసనగల్లులో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పెదసనగల్లు(మొవ్వ): అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలంటే వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మొవ్వ మండలం పెదసనగల్లు గ్రామంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యకు తక్షణ పరిష్కార దిశగా అధికారులకు సూచనలిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంతకం పెట్టిన నాటి నుంచి రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని తెలిపారు. అమలవుతున్న సంక్షేమ పథకాల లబ్ధితో ప్రతి పేదవాని మోములో చిరునవ్వులు చూడగలుగుతున్నామన్నారు. ఈ నవ్వులు శాశ్వతం కావాలంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలన్నారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, సర్పంచ్ కైతేపల్లి అన్నామణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, ఉపసర్పంచ్ పామర్తి గోపాల్, నాయకులు మేరుగు శ్రీను, జోసఫ్, అయ్యంకి శ్రావణి, చిమటా రాఘవేంద్రరావు, డొక్కు కృష్ణ, యేనుగు మోహనరావు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు

గుడివాడరూరల్: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. మండలంలోని దొండపాడు గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.4.5 లక్షలతో నిర్మించనున్న తాగునీటి ఫిల్టర్‌బెడ్‌ల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ సహకారంతో మండలంలోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. వీలైనంత త్వరగా దొండపాడులో ఫిల్టర్‌బెడ్‌ల నిర్మాణాన్ని పూర్తి చేసి స్వచ్ఛమైన నీరు గ్రామస్తులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకుడు గద్దే రాము పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి



సర్వతీదేవి అమ్మవారు

పమిడిముక్కల: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన, రెండో బాసరగా పేరొందిన మామిళ్లపల్లి సరస్వతీదేవి ఆలయంలో బుధవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. 200 మందికి పైగా చిన్నారులకు మాతా సుజ్ఞానందగిరి అమ్మవారు అక్షరాభ్యాసాలు చేయించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సర్పంచ్ ఆముదాలపల్లి సుబ్రమణ్యం, గ్రామస్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

యాంత్రీకరణపై అవగాహన



యంత్రంతో చెరకు నరికే విధానాన్ని పరిశీలిస్తున్న సీడీసీ చైర్మన్ రామచంద్రరావు, ఏజీఎం సుర్యారావు

పమిడిముక్కల: కేసీపీ షుగర్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో వీరంకిలాకులో చెరకు రైతులకు యాంత్రీకరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు మైనేని నరేంద్ర, నాదెళ్ల సుబ్రమణ్యం, ఘంటా సురేష్‌కు చెందిన చెరకు తోటలో యంత్రంతో చెరకు నరుకుడును సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, ఏజీఎం సూర్యారావు, డిప్యూటీ కేన్ కమీషనర్ ముత్యాలు రైతులతో కలిసి పరిశీలించారు. యంత్రంతో చెరకు నరికే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు నాదెళ్ల సుబ్రమణ్యం, నరేంద్రలను చెరకు సాగు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. సీడీసీ నుంచి రైతులకు ఏవిధమైన సహకారం కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఫ్యాక్టరీ అభివృద్ధికి సహకారం అందించాలని రామచంద్రరావు రైతులకు సూచించారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తోట్లవల్లూరు: అప్పు అడిగితే ఇవ్వలేదనే నెపంతో వ్యక్తిపై మరో వ్యక్తి దాడికి పాల్పడిన ఘటన మండలంలోని యాకమూరులో జరిగింది. గ్రామానికి చెందిన బొమ్మారెడ్డి కోదండరామిరెడ్డిని శొంఠి వీరబాబు అనే వ్యక్తి గతంలో రూ.20 వేల అప్పు అడిగాడు. ఆ డబ్బు ఇవ్వలేదని గ్రామంలోని సాయిబాబాగుడి వద్ద అరుగుపై కూర్చున్న కోదండ రామిరెడ్డితో మంగళవారం రాత్రి వీరబాబు గొడవ పెట్టుకుని చెక్కతో దాడికి పాల్పడ్డాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విశ్వనాథ్ తెలిపారు.

ప్రత్యేక పూజలు

పామర్రు: స్థానిక వల్మీకేశ్వరీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దేవీ హోమం, శాంతి హోమం వాస్తుహోమాలు నిర్వహించారు. భక్తులు బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి సుశీల దంపతులు, బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి భవాని దంపతులు పీటలపై కూర్చుని హోమాలను చేశారు.

91 శాతం కులగణన పూర్తి

తోట్లవల్లూరు: మండలంలో కులగణన తుదిదశకు చేరింది. ఇప్పటి వరకు మండలంలో 91 శాతం కులగణన పూర్తయినట్లు ఎంపీడీఓ ఐ. సత్యనారాయణ తెలిపారు. మిగిలిన వారు అందుబాటులో లేకపోవడంతో సర్వేలో కొంత జాప్యం జరుగుతోందన్నారు.

సంక్షిప్త వార్తలు

సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)ని రాజేంద్రనగర్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల ప్రజలు బుధవారం ఆయన్ను కలిసి సమస్యలు తెలియజేశారు. హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అవసరమైన వ్యక్తికి మెరుగైన వైద్యం చేయించాలని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తేగా స్పందించిన ఎమ్మెల్యే రూ.లక్షను కుటుంబ సభ్యులకు ఇచ్చి హైదరాబాద్‌కు వస్తున్న వ్యక్తికి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆస్పత్రి యాజమాన్యానికి సూచించారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: పురపాలక సంఘ పరిధిలోని మూడు వార్డులలో గురు, శుక్ర వారాలు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తెలిపారు. పెద ఎరికపాడు వద్ద విద్యుత్ స్తంభాల ఏర్పాటు సమయంలో 21, 22, 25 వార్డులకు నీటిని సరఫరా చేసే మెయిన్ పైప్ పగలడం కారణంగా ఈ అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. ఆదర్శనగర్, పెద ఎరికపాడు, మందపాడు, రైలుపేట తదితర ప్రాంత వాసులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

వేగవంతంగా కంప్యూటరీకరణ

ముదినేపల్లి రూరల్: కేడీసీసీ బ్యాంకు ముదినేపల్లి బ్రాంచి పరిధిలోని అన్ని సొసైటీల్లో కంప్యూటరీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు బ్యాంకు డీజీఎం ప్రభాకర్ అన్నారు. స్థానిక బ్రాంచి కార్యాలయంలో చేపట్టిన కంప్యూటరీకరణ పనులను డీజీఎం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీల్లో సభ్యులైన రైతుల వివరాలన్నింటినీ కంప్యూటరీకరణ చేస్తున్నట్లు చెప్పారు. ఏజీఎం శ్రీనివాస్, బీఎం కుమార్ పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లలో భద్రత పటిష్టం

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేస్తున్నట్లు నందివాడ ఎస్‌ఐ ఎన్.చంటిబాబు తెలిపారు. బుధవారం మండలంలోని జనార్దనపురం గ్రామంలో పోలింగ్ కేంద్రాలలో భద్రత ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఏఎస్‌ఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు అభినందన

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలను స్వీకరించిన వై.శ్రీనివాస్‌ను రేషన్ డీలర్ల మండల అసోసియేషన్ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందించారు. నాయకులు గాబ్రియేలు, అనిల్, రహీమా పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు

గుడ్లవల్లేరు: గ్రామాల్లో ఉపాధి పనులను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా అంబుడ్స్ పర్సన్ వెంకట శ్రీనివాసరావు అన్నారు. గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీపై సామాజిక తనిఖీ సదస్సును ఎంపీపీ కొడాలి సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. వేజ్ సికర్స్‌కు సకాలంలో కూలి చెల్లించాల్సిన బాధ్యత క్షేత్ర స్థాయి సిబ్బందిదేనని తెలిపారు.

భోజనం రుచికరంగా ఉండాలి

పామర్రు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని మరింత రుచికరంగా వండి విద్యార్థులకు అందజేయాలని ఎంపీడీఓ ఎం.భారతి అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం మెనూ మార్చిన నాటి నుంచి పాఠశాలలో భోజనం చేసే విద్యార్థుల సంఖ్య ఎంతగానో పెరిగిందన్నారు. హెచ్‌ఎం ఇందిరాదేవి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఎమ్మెల్యే

భట్లపెనుమర్రు(మొవ్వ): ఇటీవల మృతిచెందిన భట్లపెనుమర్రు గ్రామానికి చెందిన షేక్ కాంతారావు కుటుంబానికి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ చేయూత నిచ్చి అండగా నిలిచారు. కాంతారావు భార్య షేక్ రసూల్‌బీకి బుధవారం రూ.25వేలను ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాఘవరావు, నాయకులు చెలసాని వెంకటరత్నం, కొండేటి చందు చేతుల మీదుగా అందజేశారు.







